# 6

## కోతులు ....

పక్కింటి శారదాంబగారికి ఆ రాత్రంతా నిద్రపట్టితే ఒట్టు. నిద్ర పట్టకపోవడమే గాకుండా పచ్చి మంచినీళ్ళుకూడ సయించలేదు. పచ్చి మంచినీళ్ళు సయించకపోవడమే కాకుండా కడుపు ఉబ్బుకొచ్చింది. ఇలా చెప్పుకుంటూ పోతే • ఎన్నైనా చెప్ప వచ్చు. అసలు విషయం ఏమిటంటే, పొరుగునున్న వెంకాయమ్మ గారు రాజలాంఛనంగా కొడుకుని వెంటబెట్టుకుని, వాడికి పెళ్ళి సంబంధం చూడటానికి మళ్ళీ బయలుదేరారు. ఆమె వచ్చి ఆ పెళ్ళి సంబంధం కుదిరిందీ కుదరందీ చెప్పిందాకా, పాపం, శారదాంబగారి కింతే కాబోలును—అనగా, పచ్చి మంచినీళ్లుకూడ వంటబట్టక పోవడం, రాత్రి నిద్రపట్టకపోవడం...ఇత్యాదయః. పెండ్లిసంబంధం చూడటానికి పోయిన వెంకాయమ్మగారు మాత్రం ఎన్నిరోజులుంటుం దేం, ఆ చూడబోయినవా రింట—రేపో మాపో రాదా—ఆ కొత్త వార్త తన చెవిన వెయ్యదా—అప్పటికి గాని తనమనస్సు కుదుట బడదా—సదరు శారదాంబగారికి ఎందుకయ్యా ఇంత జిజ్ఞాస అనగా -

అనగా అనగా ఆరుగురు కుమారుల్ల తరువాత—అబ్బనాకారపు పిల్లే ననుకుందాం, మనలోమాట—అన్నగారి కో కూతురు పుట్టింది. ఆ పిల్ల అలాఅలా పెద్దదై నేటికి వాళ్ళ నాన్న కో సమస్యనే తెచ్చి పెట్టిం దనుకుందాము. మేనత్త కామాత్రం జిజ్ఞాస వుండటంలో బేసబబేముంది? ఎప్పుడో ఇరవై యేళ్ళ క్రితం ఆస్పత్రిలో పోయిన పసికూనకోసం ఆమె మనస్సు తపిస్తూనే ఉంటుంది. అటువంటిది ఏ

అమ్మ కుమారుణ్ణో తనవాణ్ణిగా చేసుకుని, ఆ కాస్త మేనకోడల్నిచ్చి చేసుకుందామనుకున్న ఆమె ఉబలాటం మగడు కాస్తా ఊదేశాడు ఉఫ్ఫుమని. ఎట్లానైనా ఆడజన్మాయిరి—ఆమె అట్లానే అనుకుంది.

మరయితే వెంకాయమ్మగారి చిన్నవాడు చూపులకేమీ బావుండడు. అయినా మనం చూడటంలో వుందికాని—ఎవరైనా యెందుకు బావుండరు? పిల్లవాడు బుద్ధిమంతుడు. తనను పిన్నిగారూ - అని పిలుస్తాడు. అప్పుడే కనుక్కుంది ఆ కలుపుగోలుతనం-అదీ. పిల్లవాడు చదువుకున్నవా డాయె. ఆ స్తిపాస్తులుకూడ తగినంతమాత్రం వుండె-తనని పిన్నిగారని పిలుస్తుంటే అటువంటి చిన్నవాణ్ణి వెంటబెట్టుకుని ఆ తల్లి పెళ్ళిసంబంధం చూడటానికి పోలోమని బయలుదేరిందంటే శారదాంబగారికి కష్టంగా ఉండదూ—మరీ కాకపోతే వెంకాయమ్మ గారికి సరదా అయింది ప్రతి తడవా సంబంధం చూడటం, పెళ్ళవటం ఇష్టంలేనట్లు—ఇన్ని సంబంధాలు చూడాలా—

శారదాంబగారికి గట్టినమ్మకమే—ఎలాగూ వెంకాయమ్మగారు సంబంధం కుదిరేంత తెలివితక్కువగా ప్రవర్తించదనీ, అయినా తన కింద జిజ్ఞాస లేకపోవునా, తన కడుపున కాసిన కాయ వుంటే ఇరవై యేళ్ల నిండేవి. ఎంచక్కా మేనగోడల్నే చేసుకునేది—పోనీ అయ్యా మేనకోడల్నే కోడల్ని చేసుకుందా మనుకుంటే వేరే మార్గాలు లేవా అంటే ఆయనంటారూ—"పోవే, నీ పిచ్చిగాని! ఎవరికో పుట్టినవాడు మనకు పుట్టినవా డవుతాడూ?" ఆమె నోరు నొక్కుకుంది. ఇంతకూ వెంకాయమ్మగారి చిన్నవాడికి తన మేనగోడల్ని చేసుకుంటే బావుండు నని ఆమె కొన్నిరోజులుగా ఆలోచిస్తోంది. ఇది బాగానే ఉంది. ఆయనకూడా బాగానేఉంది అన్నాడు. అన్నగారికి ఉత్తరం వ్రాయించింది. ఆయనకు తగని గర్వం. ఆర్నెల్లనుంచీ, ఉత్తరాల్లో చెవి నిల్లుగట్టుకుని పోరుతున్నదా—ఆ తోడబుట్టినవాడు తనమాట ఖాతరుచేశాడూ? అదేమిటంటే ఆడపిల్ల పెళ్ళి వొత్తిడా—లేక పని తొందరా ముఖ్యం.

ఈ ఆర్నెల్ల లోపునా వెంకాయమ్మగారు అరడజను సంబంధాలు చూడనే చూసిరి. అనగా సగటున నెలకు ఒక్కటి. ఇందులో

ఆమే ఎవరినైనా తనకొడుక్కి చేసుకోవటానికి ఇష్టపడి ఉన్నట్లయితే తన ప్రయత్నం అంతా వ్యర్థమయ్యేది కదా—

ఏడోనెల గడుస్తున్నది. అప్పుడే వెంకాయమ్మగారు ఏదో సంబంధం చూడటానికి వెళ్లింది. శారదాంబగారి కామాత్రం జిజ్ఞాస యెందు కుండకూడదూ?

శారదాంబగారి కారాత్రి నిద్రపట్టలేదుకదా—తెల్లవారగట్ల మూడుగంటల రైలుకి అమ్మా, కొడుకూ రానే వచ్చారు. శారదాంబ గారు లేచికూచుంది. వెంకాయమ్మగారు రిక్షావాణ్ణి కాసేపు తిట్టటం, ఇంటాయన వాణ్ణి సర్ది పంపించటం శారదాంబగారు చూస్తూనే ఉన్నారు. ఆమెకు సంతోషమైంది, అప్పుడే అడిగేయాలని. కాని ఆయన "తెల్లవారుతుంది, మరేం ఫరవాలేదు" అని భరోసా ఇవ్వటం వలన అయిష్టంగానే ఆగిపోవలసి వచ్చింది. ఆ ఇంటాయిన బెల్లం గొట్టిన రాయిలా అడగనైనా అడగడేం? ఆమె చెప్పదూ—శార దాంబగారికి తెల్లవారేట్లు లేదు. అలానే ఆ నిశియెల్ల గడవగా—

ప్రొద్దున్నే బావిదగ్గర 'హరిగోవిందా, హరిగోపాలా' అంటున్న వెంకాయమ్మగారిని శారదాంబగారు అడగనే అడిగింది.

వెంకాయమ్మగారు సగర్వంగా "ఏమో చేసుకోదలచలేదు." అని చెప్పనే చెప్పింది.

శారదాంబగారికి కావలసిన సమాధానం అదే. అయినా వెంకా యమ్మగారి కామె కళ్ళలో వివరణ అవసరం అన్న సూచన కనిపించ బట్టి—

"పిల్లకోతిలా వుంటుందండీ—ఏం చేయకపోతే చూసిచూసి" శారదాంబగారికి నోట మాటరాలేదు. "ఏడోదికూడా కోతేనా—?"

గిట్టనివా ళ్ళంటారు కదా—ఇదివరలో చూసిన ఆరు సంబం ధాల్లో మూడు వాళ్లే వొప్పుకోలేదని—ఆ మాట వెంకాయమ్మగారు ఛస్తే వొప్పుకోదు.

"ఆ ఆరూ కోతులు. ఈ ఏడోదికూడా కోతేను"—వెంకాయమ్మగారు రామభక్తురాలు.

అందుకే ఆమె కందరూ..........గా కనిపిస్తారు. ఆమె భర్తపేరు ఆంజనేయులుగారు.

ఆమె కొడుకుపేరు హనుమంతరావు. కూతురిపేరు మారుతి. —ఆమె కింకా ఇద్దరు కొడుకులుంటే బావుండును....అంగదుడూ, జాంబవంతుడూ అని పెట్టుకునేది.

శారదాంబగారు విస్తుపోయినా, తోడబుట్టినవాడికి ఆ రోజే ఉత్తరం వ్రాయించింది.

తోడబుట్టినవాడు రాడూ—శారదాంబగారు సంతోషంతో పొంగిపోయింది. "అవునా, అన్నయ్యా, యీ సంబంధం చేశావా బావుంటుంది." అని చెప్పింది. అన్నయ్య, సరేనని వొప్పుకుని వెంకాయమ్మగారి భర్తతో మాట్లాడి చక్కాపోయాడు.

వెంకాయమ్మగారు, చిన్నవాణ్ణి తీసుకుని శారదాంబగారి అన్నగారింటికి బయలుదేరింది. శారదాంబగారుకూడా ఆయన్ని యెలానో కష్టపడి ఒప్పించింది. తానూ బయలుదేరింది. అంతా బాగానే ఉంది. చూసుకున్నారు. మాట్లాడుకున్నారు. వెంకాయమ్మ వెళ్ళిపోయింది. రాజసంగా—తరువాత తెలియజేస్తాం అని చెప్పి కొడుకుని వెంటబెట్టుకుని.

ఆమె అట్లా స్టేషను చేరిందో లేదో, ఆడబడుచు తనమీద పడదూ—శారదాంబగారి క్కోపమొచ్చింది. "ఏమే అమ్మడూ—ఎలా ఉన్నాడే; నా చిట్టికదూ—చెప్ప"మన్నది మేనగోడల్ని.

"కోతిలా ఉన్నాడు, నేను ఛస్తే చేసుకోను." తా నెలా ఉందో—! శారదాంబగారికి...."మూర్ఛవచ్చె, తనువున్ డస్సెన్ శ్రమం బయ్యెడిన్...." అన్నంత పనైంది!

ఆడబడుచు 'కోతి' అన్నది వెంకాయమ్మగారి చిన్నవాణ్ణి

అన్నయ్య ఇక్కడికొచ్చి అదే అంటున్నాడు. అది సరేసరి—బరి దెగించి మాట్లాడుతోంది. అన్నయ్య అక్కడి కొచ్చినప్పుడే అఘో రించకూడదూ—తనేం చెప్పాలి. వెంకాయమ్మగారితో? శారదాంబ గారికి కోపమొచ్చింది. నవ్వొచ్చింది. 'కోతులు'—అనుకుంది. వెంకాయమ్మగారినుంచి జాబు రాకముందే. అన్నయ్య మీ సంబంధం అక్కర్లేదని వ్రాయనే వ్రాశాడు. అదట్లా జరిగింది. ఎదుటివాళ్ళంతా కోతులా! మనకు మనం అందగాళ్ళమా—అనుకుంది శారదాంబగారు.

తరువాత శారదాంబగారి ఆయనకు అక్కడినుంచి ట్రాన్స్ఫర్ కావటం, ఆమె వేరే ఊళ్ళో, ఎప్పుడూ పొరుగింటివాళ్లతో పెళ్లి సంబంధాల విషయమై మాట్లాడక పోవటమూ జరిగింది.

తరువాత రెండు మూడేళ్లూ, ఎక్కడ ఊరేగింపు కనపడ్డా, ఏ శుభలేఖ వచ్చినా, వెంకాయమ్మగారూ, తనను పిన్నిగారూ అని పిలిచే వాళ్ళ చిన్నవాడూ గుర్తు వస్తూనేవున్నారు పాపం శారదాంబ గారికి.

తరువాత మళ్ళీ వెంకాయమ్మగారి ఊరికి ట్రాన్స్ఫర్ వచ్చిం దని ఆయన చెప్పినప్పుడు శారదాంబగారికి ఆశ్చర్యమూ, ఆనం దమూ కలిగినయ్.

వెంకాయమ్మగారి పక్కభాగం ఖాళీగాలేదు.

ఆ ఊరొచ్చిన నాలుగురోజుల తర్వాత శారదాంబగారు, వెంకాయమ్మగారింటికి పోయింది. కుశలప్రశ్నాదికాలైన తర్వాత వెంకా యమ్మగారు చెప్పింది. "ఏమిటో పెద్దదా న్నయిపోయినాను. సరిగా కనపడదా—సరిగా వినపడదా—అయినా నా కింకేం కావాలిలే—" శారదాంబగారు అడిగింది చిన్నవాడి పెళ్లి గురించి.

"ఆ, చేశాం, ఎట్లానైతేనేం ఓ కోతిని దెచ్చి!"

శారదాంబగారికి నవ్వొచ్చింది.

"పిల్లలా—"

"ఆ........రెండేళ్ళవాడు కొడుకు. మళ్ళీ కాన్పుకనిపోయింది. పది రోజులు ముందొచ్చివుంటే నా మనవణ్ణి చూసేవాళ్లు. అయినా యెక్కడికి వెళతారులే! ఇక్కడే ఉంటారుగా. ఆ వెధవ ఏమి అల్లరి అనుకున్నారు. ఉట్టి కోతి వెధవ. ఒక్క క్షణం, ఒక్కచోట ఉండదు కోతి........"

శారదాంబగారికి ఆపుకుందా మనుకున్నా. ఆగనంత న వ్వొచ్చింది.

వెంకాయమ్మగారుకూడ నవ్వుతూ"వాళ్ళ తాతయ్య పేరే...." ఈసారీ శారదాంబగారికి న వ్వొచ్చింది.

శారదాంబగారు లేచి 'వెళ్ళొస్తా'నంది.

"మా కోతి వెధవ వచ్చిన తర్వాత వోసారి రండి....రామ చంద్రా, రామా, రామా." వెంకాయమ్మగారు ఆవలించింది.

అంతా రామమయం అన్నాడు వెనుకటికి యెవరో మహాను భావుడు.

అందుకే యీ లోకమంతా—మయం.

———